# నాల్గవ అధ్యాయం

## కొడవటిగంటి కథల్లో సామాజిక వ్యవస్థ - ఆర్థిక ప్రతిఫలనం

అనాది నుంచి నేటి వరకూ సామాజిక వ్యవస్థ అనేక మార్పులకు లోనవుతూ ఉంది. ఒక సామాజిక వ్యవస్థలో నిర్దిష్టమైన ఆచారాలు, విలువలు, సంస్కృతి వుంటాయి. ఈ లక్షణాలపై ఆ వ్యవస్థలోని ఉత్పత్తి సాధనాలు ఎవరి ఆధీనంలో వుంటాయో వారి ప్రభావం వుంటుంది. భూస్వామి-రైతు, పెట్టుబడి దారుడు - శ్రామికుడు మధ్య శాంతియుత వాతావరణం వుండేవిధంగా ఆ సామాజిక వ్యవస్థ వుంటుంది. కష్టించి ఉత్పత్తిలో పాల్గొనే కష్టజీవి యజమానిని ప్రశ్నించడానికి వీలుకాని రీతిలో వ్యవస్థ నిర్మితమై వుంటుంది. దోపిడీ వ్యవస్థలో ఆ వ్యవస్థ స్వరూపాన్ని దోపిడీ చేసే వర్గమే నిర్మిస్తుంది. ఈ దోపిడీ వర్గం కాలానుగుణంగా తన రూపాన్ని మార్చుకుంటుంది. కష్టజీవులపై దోపిడీ వర్గం తమ స్వార్థంకోసం తను సృష్టించిన సంస్కృతిని ఆపాదిస్తుంది. ప్రజల్ని చైతన్య రహితంగా వుంచడానికి, ఆవ్యవస్థను యథాతథంగా వుంచడానికి పాలకవర్గం నిరంతరం ప్రయత్నిస్తుంటుంది. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాల్ని చూపుతూ ప్రజల్ని తిరుగుబాటుకు దూరంగా వుంచడానికి ప్రయత్నిస్తుంది. ప్రజలు సమస్యల తీవ్రతను భరించలేని స్థితిలో ఆ వ్యవస్థపై తిరుగుబాటు చేస్తారు. తద్వారా తమకు కావలసిన నూతన వ్యవస్థను నిర్మించుకుంటారు.

### 4.1. పెట్టుబడి దారి ఆర్థిక వ్యవస్థ

వ్యక్తి సమాజంలో అంతర్భాగం. సమాజం వ్యవస్థలో అంతర్భాగం. మానవ సమాజాభివృద్ధికి అవసరమైన ఆర్థిక స్థితుల్ని ఉపేక్షించి ప్రజాభివృద్ధిని ఊహించలేము. వ్యవస్థలో ఆర్థిక సిద్ధాంతాలు పలురకాలుగా వుంటాయి. ఉత్పత్తి సాధనాలకూ, ప్రజలకూ మధ్యగల సంబంధాన్ని బట్టి సమాజంలో ప్రజల స్థానం వుంటుంది. సాంఘిక, ఆర్థిక వ్యవస్థల ఏర్పాటు వాటి అభివృద్ధి, పతనాలు వ్యవస్థాభివృద్ధి ననుసరించే జరుగుతాయి.

బూర్జువా ఆర్థిక సిద్ధాంత వేత్తలు వ్యవస్థ ఆర్థికాభివృద్ధికి చేసే సూచనలు, సమాజాభివృద్ధికి ఆటంకాలని తెలిపే అభిప్రాయాలు మెజారిటీ ప్రజల ప్రయోజనానికి వ్యతిరేకంగా ఉంటాయి. బూర్జువా సిద్ధాంత వేత్తలు, ఉత్పత్తి సాధనాలు కొంతమంది వ్యక్తుల చేతుల్లో ఉన్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని నిరూపించే ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. అయితే కార్లమార్క్స్, ఏంగెల్స్ ఉత్పత్తి సాధనాలు సమాజపరమైనప్పుడే ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని నిరూపించారు. శ్రమ దోపిడి వల్ల వచ్చే అదనపు విలువే పెట్టుబడి. పెట్టుబడిదారి వ్యవస్థలో కార్మిక వర్గం, బూర్జువా వర్గాల మధ్య వర్గ సంఘర్షణ ద్యోతకమవుతుంది.

పెట్టుబడిదారి దేశాల్లో అధిక ఉత్పత్తిద్వారా ఏర్పడే సంక్షోభాలు ఆర్థిక సంక్షోభాలుగా పరిణమిస్తాయి. పెట్టుబడిదారి దేశాలలో పారిశ్రామిక సంక్షోభాలతో పాటు వ్యావసాయిక సంక్షోభాలు కూడా ఏర్పడతాయి. అందుకే పెట్టుబడి దారులకూ – కార్మికులకు, భూస్వాములకు – రైతాంగానికి మధ్య అనివార్యమైన వర్గ సంఘర్షణ ఏర్పడుతుంది. ఈ సంఘర్షణల నుండి ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి దోహదం చేయగల విప్లవాత్మక మార్పుకు దోహదం చేసే శక్తులు ఉద్భవిస్తాయి. కొ.కు. భారతదేశంలోని పెట్టుబడిదారి వర్గపు లక్షణాల్ని అనేక కోణాలలో తనదైన దృక్పథంతో కథల్లో చిత్రించాడు. 70 సంవత్సరాలపాటు భారతీయ ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నుల్ని కుటుంబరావు కథల్లో చూడవచ్చు.

20వ శతాబ్దపు 2-3 దశాబ్దాల్లో వచ్చిన ఆర్థిక సంక్షోభ ఫలితంగా వ్యవస్థలో ఏర్పడిన విధ్వంసాన్ని, ప్రజా సమస్యల్ని, మార్పుల్ని, యుద్ధకాలంలో మధ్య తరగతి జీవితంలో వచ్చిన మార్పు, భారతదేశపు మొదటి వ్యాపార వేత్తలు పెట్టుబడి దారులుగా మారినస్థితి, మధ్యతరగతిలో వచ్చిన అభ్యుదయ శక్తులు, కమ్యూనిస్టు కార్యకర్తలు, ప్రజా విద్రోహపు చర్యలు మొదలయినవన్నీ కొ.కు. రచనల్లో చూడవచ్చు.

"మిత్రద్రోహం" కథలో - కథకుడు స్వామి, రఘుపతిలు మిత్రులు. రఘుపతిని గురించి చెప్తూ కథకుడు, "నేత గుడ్డలలో ముతక రకం వేలకువేల సరుకు ఖద్దరు కింద బొంబాయికి స్వామి ఎగుమతి చేశాడట. దాని మీదచాలా లాభాలు తిన్నట్టు...చేనేత వ్యాపారం మీద లాభాలతో స్వామి యింకా అనేక వ్యాపారాలు చేశాట్ట. స్వామి తన వ్యాపారం మానలేదని ఇప్పుడు చేనేత గుడ్డ ఎగుమతికి ప్రయత్నాలు సాగిస్తున్నాడని తనబంధువులందరి పేరా వ్యాపారం వంటి ఏదో తంత్రాలన్నీ పన్నుతున్నాడని"[1] అంటాడు.

ఇందులో స్వామి పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధి. అధిక లాభాలు ఆర్జించాలనేది అతని ఆశయం. వచ్చిన లాభాల్ని మరో వ్యాపారంలో పెట్టి, దాంట్లోను లాభాలు ఆర్జించి పెట్టుబడి దారులు వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మిస్తారు. కేవలం లాభాల ఆపేక్షే వీరి ధ్యేయంగా వుంటుంది. కాబట్టి పరిశ్రమల్లో శ్రామికుల శ్రమను దోస్తారు. ఆశ్రమ దోపిడీమూలంగానే లాభాల్ని పొందుతారు. ఆస్తుల్ని కూడబెట్టి పెట్టుబడిదారులుగా మారిపోతుంటారు. ఇక్కడ భాతదేశంలోని స్వామిలాంటి వ్యాపారవేత్తలు పెట్టుబడిదారులుగా మారినపరిస్థితిని గమనించవచ్చు.భారతదేశంలో అప్పుడప్పుడే అంకురిస్తున్న పెట్టుబడిదారి ఆర్థిక క్రమం కొ.కు. కథల్లో కనిపిస్తుంది.

### 4.2. యుద్ధ కాలం

ప్రపంచ వ్యాప్తంగా జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధాల మూలంగాను, ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న ఆర్థిక సంక్షోభం వల్లనూ, ప్రజల జీవితాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఈ కాలంలో భారతదేశపు మొదటి వ్యాపార వేత్తలు, పెట్టుబడిదారులుగా మారిపోయాయి. దోపిడీ విధానాలు, డబ్బుపట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యామోహం కొ.కు. తన కథల్లో నిక్షిప్తం చేశాడు. ఆర్థిక సంక్షోభానంతరం జరిగిన రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సమాజంలో

వచ్చినమార్పులు, ఈ యుద్ధం ఎవరికోసం జరిగిందో కూడా కొ.కు. కథల్లో కనిపిస్తుంది.

"శీల పరిశీలన" కథలో - కథకుడు తన మిత్రుని గురించి చెప్తూ, "తీరా యుద్ధం వచ్చేటప్పటికి వీడి అసలు రంగు బయటపడింది. వీడోచంప యుద్ధాన్ని సమర్థిస్తూ యుద్ధ ప్రయత్నం చేసి, బాగుపడ్డ వాళ్ళని తిట్టాడు. దోపిడీ గాళ్ళన్నాడు. దొంగ వ్యాపారులన్నాడు. వాళ్ళు బాగు పడ్డారని వీడికి కడుపు మంట. తనుపోయి ఆ అలగామూకతో చేరి వెధవ చాకిరీ అంతా చెయ్యకపోతే తను ఏదో అవకాశం చూసి ఇంత వెనకేసుకోరాదూ? ఎవడొద్దన్నాడు?"[2] అని అంటాడు.

ఇక్కడ కథకుని మాటల్ని నిశితంగా పరిశీలిస్తే. సమాజంలో కొందరు ఆదర్శ భావాల్ని, ఉన్నత విలువల్ని కల్గి ఉన్నట్లు పైకి నటిస్తారు. వీరి మనసు ద్వంద్వ వైఖరితో ఆలోచిస్తుంది. దొంగ వ్యాపారాలుచేసి సంపాదించిన వాళ్ళని పైకి తిడతారు. లోలోపల వాళ్ళలా తాము ఎందుకు సంపాదించుకోలేక పోయామా అని బాధపడతారు. ఇలాంటి కుహనా మనస్తత్వం సమాజంలో బలంగా వుందని, అలాంటి వాళ్ళను గురించి విమర్శనాత్మకంగా చెప్పడమే ఇక్కడ రచయిత ఉద్దేశ్యం.

"పిరికి గుండె" కథలో - కథకుడు చెప్తూ, కోటేశ్వర్రావు దరిద్రం అనుభవించిన వాడు. చిన్నపాటి ఉద్యోగం సంపాదిస్తాడు. డబ్బుకన్నా సమాజంలో ఏదీ ప్రధానం కాదు అనుకుంటాడు. ప్రపంచం మనదగ్గర వున్న డబ్బును బట్టే లక్ష్య పెడుతుందని భావిస్తాడు. ఇంకా ఇంకా సంపాదించాలని, పై సంపాదనల కోసం ప్రయత్నాలు చేస్తాడు. ఇంతలో "యుద్ధం వచ్చింది. ఎవరో స్నేహితుడు తన్నొక వ్యాపారంలోకి చేరమన్నాడు. గత యుద్ధంలోలాగే వస్తువుల ధరలు పెరిగి లాభం వస్తుందన్నాడు. కోటేశ్వరరావు తను పోగు చేసిన అయిదు వందలూ స్నేహితుడికిచ్చేశాడు. ఏవో వస్తువులు కొన్నారు. అమ్మారు. చాలా డబ్బొచ్చింది.

వ్యాపారం సాగింది. కోటేశ్వర్రావుకు భాగం పెరిగింది. ఒక సంవత్సరం కాలంలో అతను రెండువేలు లాభం తీశాడు. ముఖ్యంగా మందుల మీద చాలా లాభం వచ్చింది... గుడ్డల వ్యాపారం చేదామన్నాడు స్నేహితుడు. సరేనన్నాడు కోటేశ్వరరావు.... కోటేశ్వర్రావుకు అయిదు వేలు చేసుకున్నాడు. వ్యాపారం రకరకాలుగా సాగుతున్నది. ఇప్పుడంతా దొంగ వ్యాపారమే.... ఆర్నెల్లలో యుద్ధం అయిపోయింది. దొంగ మార్కెట్టు అంతకన్నా అయిపోదు, భయపడటానికిందిలో ఏముంది"[3] అంటాడు.

ఈ విషయాన్ని పరిశీలిస్తే. సమాజంలో అట్టడుగు వర్గాలకు చెందిన వ్యక్తులు దారిద్ర్యంతో ఇబ్బంది పడతారు. పట్టణాల్లో చేరి చిన్నచిన్న ఉద్యోగాలు సంపాదిస్తారు. వారు డబ్బే జీవితానికి ముఖ్యమైందనే భావనకొస్తారు. ఇక డబ్బు సంపాదన ఎలా సాధ్యపడుతుందో అన్వేషిస్తారు. డబ్బుపట్ల వ్యామోహంతో దొంగ వ్యాపారాలవైపు ఆకర్షించబడతారు. యుద్ధకాలంలో నిత్యావసరాలు ప్రజలకు అందుబాటులో వుండవు కాబట్టి నిత్యావసర వస్తువుల్ని ముందుగానే కొని వాటికి డిమాండ్ పెరిగినప్పుడు అధిక ధరలకి అమ్మి సంపాదిస్తారు. ఆ సొమ్మును మరో దొంగ వ్యాపారంలో పెట్టి మరింత సంపాదిస్తారు. యుద్ధం అయిపోయినా ఈ సంపాదన తగ్గదు. ఈ క్రమంలో దేశంలో అత్యవసర పరిస్థితులేర్పడినప్పుడు అధిక ధరలకు అమ్ముకుంటారు. అధికంగా లాభాలు గడిస్తారు. కోటేశ్వర్రావు లాంటి వారు దోపిడీ దారులుగా మారడానికి యుద్ధకాలం ఎలా ప్రోత్సహించిందో చెప్పడమే ఇక్కడ రచయిత ఉద్దేశం.

"అద్దెకొంప" కథలో - కథకుడు శివకామయ్యను గురించి చెప్తూ, మా శివకామయ్యకు పట్నంలో ఉద్యోగం వచ్చింది. శారదాంబను పెళ్లి చేసుకున్నాడు. పట్నంలో కాపురం పెట్టాడు. కొంత కాలానికి శివకామయ్యకు ఇల్లు అద్దెకిచ్చిన వాళ్ళు ఖాళీ చేయమంటారు. శివయ్య "నా దగ్గర మూడుగదులకు అద్దెపుచ్చుకుంటూ

ఇదేంపని?" అని ఇల్లుగలవాళ్ళని అడిగాడు. దానికి ఇంటి వాళ్ళు "ఈ రోజుల్లో పదిహేను రూపాయలకు మూడు గదులెట్లా వస్తాయి? ఈ రెండు గదులకూ కలిపి పాతిక రూపాయలు చెవులు మెలేసి పుచ్చుకుంటున్నాము" అని అంటారు. శివయ్యకు ఇంటివాళ్ళ డబ్బు దాహమూ, దగాబుద్ధీ చూసి ఆశ్చర్యపడతాడు. "యుద్ధం మూలంగా ప్రజల మనస్తత్వంలో కలిగిన మార్పు ప్రత్యక్షంగా చూడటం అతనికదే మొదటిసారి. కానీ చేసేదేమీ కనిపించలేదు"[4] అనిఅంటాడు.

ఈ అంశాన్ని పరిశీలిస్తే యుద్ధంనడుస్తున్న పరిస్థితుల్లో మనిషి అవసరాలైన తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, కట్టడానికి గుడ్డలకు లోటు ఏర్పడుతుంది. దేశంలో వీటిని ఆధారంగా చేసుకుని సాగే దొంగ వ్యాపారాలు పెరుగుతాయి. పట్టణాల్లో యుద్ధం మూలంగా ఏర్పడిన పరిస్థితివల్ల ఆర్థిక దోపిడీ ఎక్కువగా జరుగుతుంది. పట్టణాల్లో సాధారణస్థాయి ఉద్యోగికి ఉండడానికి ఇల్లు కూడా దొరకని స్థితి. అద్దెలు పెరగడం, ధరలు పెరగడం లాంటివి చోటు చేసుకుంటాయి అని చెప్పడమే రచయిత ఉద్దేశ్యం.

"పైకి వచ్చినవాడు" కథలో - సీతారామారావు పట్నంలో నూరు రూపాయల సంపాదనకల్గిన వ్యక్తి. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ మామగారి సాయంతో ఉన్నత ఉద్యోగాన్ని పొందుతాడు. "యుద్ధం వచ్చింది. మామగారు తన పలుకుబడితో సీతారామారావుకు రకరకాల ఉద్యోగాలిప్పించాడు. యుద్ధనిధి వసూళ్ళు - ప్రాపగండా రిక్రూట్‌మెంట్, చివరకు సప్లయి శాఖ. వీటిల్లో పనిచేసి అతను చాలా డబ్బు పోగుచేశాడు. పెద్దపెద్ద వాళ్ళను పట్టుకున్నాడు. లంచాలు పట్టాడు. కోటాలు సంపాదించాడు. యుద్ధం ముగిసినా సంపాదన హెచ్చింది."[5]

పై సీతారామారావు స్థితిని గమనిస్తే..., దేశంలో అత్యవసర పరిస్థితులు, యుద్ధాలు లాంటివి ఏర్పడినప్పుడు చదువుకున్న వాళ్ళు, ఉద్యోగస్తులు ఆ అత్యవసర పరిస్థితులు తొలగించడానికి తమవంతు సహాయ సహకారాలు

అందించాలి. అయితే ఈ కథలోని సీతారామారావు లాంటి వాళ్ళు కొందరు ఆ పరిస్థితుల్ని వివిధ పద్ధతుల్లో తమ స్వప్రయోజనాలకోసం, సంపాదించుకోవడానికి, ఎదుటి వారిని దోపిడీ చేయడానికి ఉపయోగించుకుంటారు. ఇది దేశ ద్రోహం లాంటిదే అవుతుందనే అంశాన్ని రచయిత ఇక్కడ వ్యక్తపరిచాడు.

"కలిసిరావాలి" కథలో – రంగయ్యకు డబ్బుపై ప్రేమ, మమకారం ఎక్కువ. తన దగ్గరవున్న డబ్బును పెంచుకోవాలనుకుంటాడు. వడ్డీ వ్యాపారం చేస్తాడు. పట్నం వచ్చి రకరకాల అవకాశాలను అందిపుచ్చుకుంటాడు. "ఇంతలో యుద్ధం వచ్చింది. రంగయ్య పంట పూర్తిగా పండింది. యుద్ధం జరిగితే వస్తువులు దొరకవనేది చాలామందికి తెలుసు. దాన్ని సరిగా వినియోగపరచుకున్నవాడు రంగయ్య. అందిన వస్తువులల్లా చాలా కొనేశాడు. అన్నింటికన్నా బంగారం విరివిగా కొన్నాడు. అనేక కాంట్రాక్టులు సంపాదించాడు. రెండు చేతుల్లా డబ్బు గడించాడు. యుద్ధ కాలంలో అనేకమందికి పరిశ్రమల మీద ఆసక్తి పుట్టడం కనిపెట్టాడు రంగయ్య."[6]

ఈ అంశాన్ని పరిశీలిస్తే. యుద్ధ కాలంలో సాధారణ మధ్యతరగతికి చెందిన వాళ్ళు వడ్డీ వ్యాపారం చేయడం, ఆర్థికంగా సమాజాన్ని దోపిడీ చేయడం కన్పిస్తుంది. యుద్ధం జరిగేస్థితి వస్తే వాళ్ళే మరింత దోపిడీ దారులుగామారి సంపాదిస్తారు. యుద్ధకాలంలో నిత్యావసరాలు దొరకవు. దాంతో ధరలు ఆకాశాన్నంటుతాయి. సప్లై కూడా తక్కువగానే వుంటుంది. దీంతో రంగయ్యలాంటి కొందరు నిత్యావసర వస్తువుల్ని ముందుగానే కొని, దొంగ మార్కెట్టుకు తరలించి, అధిక లాభాలకు అమ్ముకుని ధనికులవుతారు. ఆ డబ్బును కాంట్రాక్టుల్లో, పరిశ్రమల్లో పెట్టి పెట్టుబడి దారులుగా మారతారు. అక్కడ పేదల శ్రమను లాభంగా మార్చుకుంటారు. దీంతో సమాజంలో అంతరాలుపెరిగి పేదవాడు మరింత పేదవాడిగా, ఉన్నవాడు మరింత సంపన్నుడిగా మారారని రచయత తెలిపాడు.

"పగటి కలలు" కథలో - కథకుడు అమాంతంగా డబ్బు సంపాదించాలి అనే ఆలోచనతో పలురకాలుగా ఆలోచిస్తాడు. పగటి కలలు కంటూ ఉద్యోగాల గురించి, "ముష్టి ఉద్యోగాలు, ఉద్యోగాలదేమిటిగాని వ్యాపారస్తులు బాగుపడ్డారు. తవుడూ, చిట్టూ అమ్మిన వాళ్ళు కూడా రెండుచేతులా డబ్బు చేసుకుంటే, ఈసారి యుద్ధమే వస్తే నేను వ్యాపారం చేస్తాను. కిందటి యుద్ధంలో వ్యాపారస్తులు డబ్బు చేసుకోవటం కళ్ళారా చూశానుగద. మా వూళ్ళో తిరుపతయ్య ఇనపకొట్టు మీద ఎంత లాభం చేశాడు. బియ్యం మీద కాంట్రాక్టు తీసుకుని ఎందుకు ఇందులో ఇరుక్కున్నానా అని ఏడిచే గణపతికి ఒక్కసారి సిరి ఎత్తుకోలా, మందుల కొట్ల వాళ్ళ సంగతి వేరే చెప్పనే అక్కర్లేదు. మళ్ళీ తప్పక యుద్ధం వచ్చేస్తుంది. ఇల్లూ, పొలమూ తాకట్టు పెట్టయినాసరే మందులూ మాకులూ కొని దాచిపెట్టేస్తాను. రెట్టికి రెట్టింపు లాభంవచ్చేస్తుంది. అదిపెట్టి ఇంకా సరుకు కొనేస్తాను"[7] అనుకుంటాడు.

పై మాటల్లో కథకుని ఆలోచనను పరిశీలిస్తే, కొందరు సులభంగా, అమాంతంగా డబ్బు గడించాలనుకుంటారు. అందుకోసం పలురకాలుగా ఆలోచిస్తారు. ప్రయత్నిస్తారు. యుద్ధ సమయంలో అయితే దొంగ వ్యాపారం బాగా సాగటాన్ని గమనించి తాము కూడా అలా సంపాదించాలని కోరుకుంటారు. అలా అవినీతి ద్వారా, దోపిడీ పద్ధతుల్లో డబ్బు గడించాలనుకునే యువకుల పగటికలల్ని ఇక్కడ రచయిత సూటిగా విమర్శించడాన్ని గమనించవచ్చు. అయితే యువకులు పగటి కలల్ని కంటూ అక్రమార్కుల్ని ఆదర్శంగా తీసుకుని డబ్బు సంపాదించాలనుకోవటం సరికాదు. జీవితాన్ని వృధా చేయకుండా సక్రమ పద్ధతుల్లో తమ బాధ్యతల్ని నిర్వర్తించాలి. డబ్బు గడించాలి అని రచయిత పై మాటల ద్వారా యువతకు సూచించాడు.

## 4.3. ఆర్థిక దోపిడీ

సమాజంలో మనిషి అవసరాలకు డబ్బు కావాలి. అవసరాలకు మించి అదనంగా డబ్బు సంపాదించే పద్ధతుల్లో ఆర్థిక దోపిడీ ప్రధానంగా జరుగుతుంది. ఆర్థిక దోపిడీ విధానాలు నీచంగాను, హేయంగాను, దుర్మార్గంగాను, ఉంటాయన్న వాస్తవాన్ని కొ.కు. కథల్లో చిత్రించాడు. ఆర్థిక దోపిడీ మూలంగానే పేద, ధనిక వర్గాల మధ్య అంతరం మరింతగా ఏర్పడుతోంది. మనిషి జీవితంలోని ప్రతి అంశానికి డబ్బుతో సంబంధం ఉంటుంది. అందులో భాగంగానే విశ్వాసాలు, ఆచారాలు కూడా ఈ ఆర్థిక దోపిడీలో భాగమయ్యాయి. శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వకుండా ఆ ప్రతిఫలాన్ని లాభాల రూపంలో కొందరు పెట్టుబడిదారులు దోపిడీ చేయడాన్ని రచయిత గుర్తించాడు. అదేవిధంగా డబ్బున్నవాళ్ళు దోపిడీ చేసిన సొమ్ముతో సమాజంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తూ సమాజాన్ని మరింతగా దోపిడీకి గురిచేయడాన్ని కొ.కు. తన కథల్లో చిత్రించాడు.

'రాజకీయాలు' అనే కథను పూర్వ అధ్యాయంలో అప్పులు అనే శీర్షికలో ప్రస్తావించుకున్నాం. ఈ కథలో ఆర్థిక దోపిడీకి సంబంధించిన అంశాన్ని కూడా కొ.కు. కొంత చిత్రించాడు. ఆ కథను మరోసారి గుర్తుచేసుకుందాం. ఈ కథలో రాజు విశ్వేశ్వరగుప్తను డబ్బు అప్పుగా అడుగుతాడు. అప్పుడు విశ్వేశ్వరగుప్త, "మీరు నాకిచ్చిన డబ్బు మీకు నేనిచ్చాను. అది నాదా?" అంటాడు. "మీకింకా ఇస్తుంటాను ఒక్క ఉపకారం చేస్తే మీ మంత్రిగారు ఏర్పరిచే చట్టాలు – నామాట నా సౌఖ్యం అట్లా వుంచండి? ప్రజలకు బాధగా వుంటున్నై, నా వస్తువులు నేను వందమైళ్ళు పంపించేటప్పటికి ఖర్చులు తగిలి జనం బాధపడుతున్నారు. నాకు మీరు మంత్రిత్వం యిస్తే ఇక్కడి సరుకులకన్న నా సరుకులు చవక చెయ్యగలను. జనానిక్కావలసిందేమిటి? మరోమాట మీముఖ్య పట్టణం నాకమ్మేసేయండి. మరమ్మత్తులు, దీపాలూ, వీధులూ నేనే చూసుకుంటాను భత్యుడ్ని" అని అంటాడు.

రాజు దర్జాగా నీకడ్డమేమిటి అన్నట్టుగా చెయ్యి ఉపేశాడు." గుప్త వెంటనే "చిత్రం ఏటుపోయి ఎటొచ్చినా మంచిది. ఈగుర్తు పెట్టినచోట సంతకం చెయ్యండి. మరిచి పోయినాను చెప్పటం మీకెందుకు శ్రమ? సైన్యాని క్యూడా నేనే"[8] అని అంటాడు.

రాజుతో విశ్వేశ్వరగుప్త పల్కిన మాటల్ని బట్టి, రాజు అవసరాల్ని గుర్తించి వ్యవస్థనే దోపిడీ చేయాలనుకున్న విశ్వేశ్వర గుప్త ఆర్థిక దోపిడీ కన్పిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల కల్గే ప్రమాదాన్ని కొ.కు. ఇక్కడ వెల్లడించాడు. సమాజంలో అప్పు తీసుకున్నాక అప్పు ఇచ్చిన వ్యక్తి విధించే షరుతులకు తీసుకున్న వ్యక్తి ఒప్పుకోవాల్సి వుంటుంది. అప్పుడే అప్పు దొరుకుతుంది. ఇదే రాజ్యానికి, ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుంది. పెట్టుబడిదారుల దగ్గర ఆర్థిక సహకారాన్ని పొందితే వారి ఆంక్షలకు తలొంచాల్సి వస్తుంది. పెట్టుబడి దారులు ఎంతటి కుట్రపూరిత దోపిడీ పద్ధతులతో అవసరాల్నిఆసరాగా తీసుకుని రాజ్యాల్ని కూడా ఎలా తమ చెప్పుచేతల్లోకి తీసుకుంటారో ఈ కథ ద్వారా కొ.కు. వెల్లడించాడు.

"రంగయ్య తాతగారి పరువు మర్యాదలు" కథలో – రంగయ్య చేసే ఆర్థిక దోపిడీని గురించి అతని మనవడు చేప్తూ, "మా తాతకి నిజంగా పరువూ పాడూ ఏమీ లేదు. పరువున్నవాడు మూడేళ్ళనాటి పాత గుడ్డలు పిగిలినందుకు చాకలాడికి డబ్బు విరగ్గొస్తాడా? పంటలు పండక రైతులు అలో లక్ష్మణా అని ఏడుస్తుంటే బకాయిపడ్డ ధాన్యానికి పత్రాలు రాయించి పుచ్చుకుంటాడా? కష్ట సమయంలో ఉండి తన నౌకరీలోకి రాలేకపోయిన కూలీ వాళ్ళని పనిలోనుంచి తోసెయ్యడమేకాక ఊళ్ళో వాడి కెవరూ పని ఇవ్వకుండా చేసి ఊళ్ళోనించి సాగనంపుతాడా? ఈ ఊరి అలగాజనంలో మా తాత చస్తే పండగ చేసుకోని వాళ్ళుంటారా? దోపిడీ చేసేదొంగ వెధవలకి పరువు ప్రతిష్టలేమిటి?"[9] అని అంటాడు.

ఈ మాటల్ని పరిశీలిస్తే గ్రామాల్లోని మోతుబరి రైతులు క్రింది వర్గాల్లోని ప్రజలు శారీరక శ్రమను నిత్యం దోచుకోవాలనే ప్రయత్నిస్తారు. పనివాళ్ళ

పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తారు. వారి ఆర్థిక, సామాజిక సమస్యల్ని పట్టించుకోరు. కేవలం తమ అవసరాలకు మాత్రమే ఉపయోగించుకుని వారిపట్ల క్రూరత్వాన్ని ప్రదర్శిస్తారు. అయితే సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి, అభ్యుదయభావాలను, నూతన ఆలోచనతో కూడిన భావాల్ని పెంపొందించాయి. దీంతో కొందరు తమ కుటుంబపెద్దలు చేస్తున్న దోపిడీని వ్యతిరేకిస్తున్నారు. నూతనతరంపై విజ్ఞాన శాస్త్రాల ప్రభావాన్ని, పాత తరానికి చెందిన రంగయ్య, నూతన తరానికి చెందిన అతని మనవడి పాత్రల మధ్య దోపిడీ తత్వంపైగల మానసిక వైరుధ్యాల్ని రచయిత ఈ కథలో చిత్రించాడు.

"అట్టడుగు" కథలో - రాములు గణపతిని గురించి కథకునికిచెప్తూ, "ఇపుడు వాడికి డబ్బున్న వాళ్ళ ప్రాపకం వుంది. ఇన్నాళ్ళు వాణ్ణి ఉపేక్షించిన కాంగ్రెస్సువాళ్ళు వాణ్ణిపుడు చేరదీశారు. ఈ వూళ్ళో కొత్త ధనికవర్గం ఏర్పడింది. దొంగ వ్యాపారస్తులు, పర్మిట్ల వాళ్ళూనూ, వాళ్లంతా మనవాడికి పోషకులు. నూవూ, నేనూ వాడికిప్పుడొక మనుషులల్లే కనిపించం. వాడిప్పుడు బియ్యం అమ్మి, డబ్బు వడ్డీలకిచ్చీ డబ్బున్న వాళ్ళని పొగడీ చక్కగా జరుపుకుంటున్నాడు"[10] అని చెప్తాడు.

ఈ మాటల్ని గమనిస్తే, గ్రామాల్లోని ప్రజలందరూ ప్రేమాభిమానాలతో కలిసి వుండేవారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన పరిణామాల ఫలితంగా ఒక నూతన ధనికవర్గం ఏర్పడింది. వాళ్ళు దొంగ వ్యాపారాలు, వడ్డీ వ్యాపారాలు చేసుకుని సంపాదనలు మొదలు పెట్టారు. వీరిని రాజకీయ నాయకులు చేరదీశారు. దాంతోవారు మరింత సంపన్నులుగా మారడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. తద్వారా అట్టడుగు వర్గాలు మరింత దోపిడీకి గురైనాయి. దీంతో సంపన్నులు మరింత సంపన్నులుగా మారారు. పేదవారు మరింత పేదవారిగా మారి దారిద్ర్యంలోకి కూరుకుపోయారు. ఇలా సమాజంలో డబ్బున్నవారు మరింత ధనికులై పేదలను ఎలా దోపిడీ చేస్తున్నారో తెల్పడమే పైమాటల్లో రచయిత ఉద్దేశ్యం.

"వాయు భక్షకుడు" కథలో - రంగడు మహత్తు కల్గిన వాడనీ, అన్నం తినకుండా జీవిస్తున్నాడనే వార్త పత్రికల్లో పడుతుంది. రంగడిని భగవదంశసంభూతునిగా లక్ష్మమ్మ భావిస్తుంది. రంగడ్ని చూడడానికి జనం కానుకలతో రావటాన్ని చూస్తుంది. పవిత్ర వాతావరణం కల్పిస్తే కానుకలు ఇంకా అధికంగా వస్తాయని గ్రహించి ఆ సంగతిని వెంకయ్యతో చెప్తుంది. వెంకయ్య "రాఘవయ్యతో మాట్లాడి వాళ్ళ తోటలో చిన్న కుటీరం వేయించాడు. అందులో రంగడికి మకాం ఏర్పాటు చేశారు. వాడికి చిన్న యోగి వేషం వేయించాడు వెంకయ్య. తపస్సు చేస్తున్నట్లు వాణ్ణి కూచోమన్నారు. ఎవరికీ ఏమీ జవాబు లివ్వక్కర్లేదన్నారు. భక్తులందర్నీ అక్కడికిరమ్మన్నారు."[11]

ఈ విషయాన్ని గమనిస్తే, సాధారణంగానే మధ్య తరగతి ప్రజల్లో భక్తి విశ్వాసాలు అధికం. స్వాముల్నీ, బాబాలను నమ్ముతారు. సాధారణ మనిషికన్నా కాస్త వైరుధ్యం కల్గిన వ్యక్తులపట్ల ఆకర్షించబడతారు. వారిని దైవాంశ సంభూతులుగా నమ్ముతారు. మూఢభక్తిని ప్రదర్శిస్తారు. మధ్యతరగతి విశ్వాసాల్ని కొందరు దొంగ స్వాములు, దొంగ బాబాలు అవకాశంగా చేసుకొని డబ్బు సంపాదిస్తారు. ఇలా ప్రజల మూఢనమ్మకాల్ని, ఆధ్యాత్మిక భక్తి విశ్వాసాల్ని కూడా ఏవిధంగా దోపిడీ దారులు ఆర్థికంగా మలిచి దోపిడీ చేస్తున్నారో పై మాటల్లో రచయిత చిత్రించాడు.

"కలిసి రావాలి" కథలో - కథకుడు, " డబ్బు అనారోగ్యకారి, ఉల్లాసం యిస్తుంది. కీర్తి ఘనతా ఇవ్వటం మాట చెప్పనే అక్కర్లేదు. డబ్బు విజ్ఞానం కూడా ఇస్తుంది. అనేక పుస్తకాలు చదివినవాళ్ళు తెలుసుకోలేని సంగతులు డబ్బున్నవాడికి ఇట్టే తెలిసిపోతాయి. డబ్బున్న వాళ్ళు కవులకు కవిత్వం ఎట్లా రాయాలో, చిత్రకారులకు బొమ్మలెట్లా గీయాలో, గాయకులకు పాటలెట్లా పాడాలో, నటులకు నాటకం ఎట్లా వుండాలో చెప్పటం నేను స్వయంగా చూశాను. ఇంతే కాదు వాళ్ళు డబ్బున్నవాళ్ళు చెప్పినట్లు చెయ్యటం చూశాను"[12] అని అంటాడు.

ఈ కథలోని మాటల్ని పరిశీలిస్తే, డబ్బుకు సమాజంలో వున్న ప్రాధాన్యత ఎంతో తెలుస్తుంది. డబ్బుగల వాళ్ళు సమాజంలోని ప్రధానాంశాలన్నింటినీ ప్రభావితం చేయగలరు. డబ్బు ఎలాంటి పనినైనా, ఏ రకంగానైనా చేయిస్తుంది. డబ్బు విలువ ముందర మనుషుల వ్యక్తిత్వాలు, గౌరవాలు, విలువలు నిలబడలేవు. మానవీయ విలువలు దోపిడీకి గురవుతాయి. సమాజం యాంత్రికంగా మారిపోతుంది. ప్రజలు డబ్బుచుట్టూ తిరిగేస్థితి ఏర్పడుతుంది. సమాజంలో డబ్బుకు ప్రాధాన్యం పెరిగేకొద్దీ సంఘం పతనదశవైపు పయనిస్తుందనే పరోక్ష హెచ్చరికను ఈ మాటల్లో రచయిత వ్యక్తపరిచినట్లు భావించవచ్చు.

## 4.4. సామ్యవాద ఆర్థిక వ్యవస్థ

సమాజం నిరంతరం పరిణామ చెందుతూ వుంటుంది. ఈ పరిణామంలో భాగంగా ప్రాచీనకాలం నుంచీ నేటివరకూ వివిధ సామాజిక వ్యవస్థలు ఏర్పడ్డాయి. అవి ఆదిమ సమాజం, రాచరిక వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారి వ్యవస్థ, సామ్యవాద వ్యవస్థ. ఆదిమ వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ వరకూ ఉత్పత్తి సాధనాలు కొంతమంది ఆధీనంలోనే వున్నాయి. సామ్యవాద వ్యవస్థలో ఉత్పత్తి శక్తులు ప్రజల పరమవుతాయి. ఇక్కడ సామాజిక సంపదకు ప్రజలే యజమానులు. ముందటి వ్యవస్థల్లో ప్రజలకు వుండే అనేక సామాజిక సమస్యలు ఈ వ్యవస్థలో పరిష్కారమవుతాయి. ఇక్కడ ప్రజలే ప్రభువులుగా చలామణి అవుతారు. శక్తి కొలదీ పని, అవసరం కొద్దీ సౌకర్యాలు అనే సూత్రం ఇక్కడ అమలవుతుంది. మనిషిని మనిషి దోపిడీ చేసే విధానం ఇక్కడ నశిస్తుంది. ప్రజలందరికీ సమానమైన అవకాశాలు, హక్కులు, బాధ్యతలు వుంటాయి. దేశం తనది అనే జాతీయత భావం ఇక్కడ ప్రతి మనిషిలో వుంటుంది. కుల,మత, వర్గ,వర్ణ విచక్షణా భేదాలు ఇక్కడ మృగ్యమవుతాయి. ప్రజలు శాంతి, సామరస్యాలతో సుహృద్భావ వాతావరణంలో ఆనందంగా జీవిస్తారు. ప్రతి వ్యక్తిలో ఆత్మవిశ్వాసం,

ఆత్మగౌరవం కొట్టుమిట్టాడుతుంటాయి. ఒకరు మరొకరి కింద తలొంచుకుని జీవించే స్థితి ఇక్కడ వుండదు.

"విచిత్రవివాహం" కథలో - కథకుడు "అన్ని శక్తులూవున్న మగవాడికి ఆస్తిలో భాగమేమిటి? అసలు మగవాడికన్నా ఆడదానికి అనేకరెట్లు డబ్బు అవసరం. పిల్లలను ఎవరైనా కననీగాక ఏ ఆడదానిపిల్లలు ఆ ఆడదాని పోషణలోనే ఉండటం సహజం. నా పెద్దమ్మాయి కొద్ది కాలంలో ఉద్యోగంలో ప్రవేశించబోతున్నది. మా చిన్నదాన్ని పెద్ద చదువు చదివిస్తాను. అది నెలకు నూరు, నూటయాభై సంపాదిస్తే గాని నాకు తృప్తి ఉండదు. నా స్వార్జితం ఇద్దరికీ సమంగా పంచేస్తాను"[13] అని అంటాడు.

ఇక్కడ కథకుని మాటల్ని పరిశీలిస్తే సమాజంలో పురుషులు అన్ని విషయాల్లోనూ శక్తివంతులుగా వుంటారు. వారు ఎలాంటి కష్టతరమైన పనులైనా చేస్తూ సంపాదించుకోగలరు. అయితే స్త్రీలు శారీరకంగా బలహీనులుగా వుంటారు. సంతానంపట్ల వారికి బాధ్యతలు ఎక్కువగా వుంటాయి. కాబట్టి స్త్రీలకు మగవాడికన్న ఆర్థిక అవసరాలు ఎక్కువ. అందుకే ఆస్తిహక్కు పురుషుడికి అవసరంలేదు. ఆస్తి హక్కును స్త్రీలకు మాత్రమే పరిమితం చేయాలి. సమాజంలో సగభాగమైన మహిళ ఎప్పుడయితే ఆర్థికంగా బలపడుతుందో అప్పుడే సమాజం బాగుపడుతుంది. ఇందులో స్త్రీల విద్య ప్రముఖ పాత్ర వహిస్తుందనే భావన పై మాటల్లో కొ.కు. వ్యక్తపరిచాడు.

"రామారావు ప్రణయ కథ" కథలో - కథకుడు నాటకరంగంలో వున్ననటుడు. "మేము ప్రదర్శించిన ఏడెనిమిది ప్రదర్శనలకు గానుచౌదరి నాలుగు వేలపై చిల్లర సంపాదించాడు. మా మెంబర్లలో ఎవరికీ 50, 60 రూపాయలకు పైగా దక్కలేదు. పేపర్లలో మెప్పు సంపాదించింది మేమూ, లాభం మొత్తం చౌదరికి ఎందుకు పోవాలి"[14] అని అనుకుంటాడు.

పై కథకుని మాటల్ని పరిశీలిస్తే పెట్టుబడి దారీ వ్యవస్థలో పెట్టుబడి దారుడు తమ సొమ్మును పెట్టుబడిగా పెట్టి కార్మిక, కర్షకుల శ్రమను దోపిడీ చేసి లాభాలు సంపాదిస్తాడు. అదే విధంగా కళారంగంలో కూడా ఈ కథలోని చౌదరిలాంటి నిర్మాతలు నటీనటుల శ్రమను దోపిడీ చేసి వారి శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వకుండా లాభాలు పొందుతారు. ఇలాంటి శ్రమదోపిడీ నశించి, శ్రమకు తగ్గ ఫలితాలు లభించే సమాజంరావాలి అని రచయిత "లాభం మొత్తం ఆ చౌదరికే ఎందుకు పోవాలి?" అనే ప్రశ్నద్వారా పరోక్షంగా కోరుకున్నాడు.

"యమ సందర్శనం" కథలో - కథకుడు యమలోక సందర్శనం చేస్తాడు. యమధర్మరాజుతో సంభాషిస్తూ, "నీకు న్యాయమనేది తెలుసునా? నేను సోషలిస్టును. ప్రొలిటేరియనులను నువ్విట్లా బాధ పెడితే నేను సహించను తెలిసిందా?. నేను డబ్బును పంచాలనే తత్వం వాణ్ణి. పాపాన్ని పంచు. డబ్బు కంటె పాపం వుందా ఏమిటి?"[15] అని అడుగుతాడు.

ఇక్కడ కథకుని మాటల్ని గమనిస్తే సమాజంలో సకల అసమానతలకు ప్రధాన కారణం డబ్బు. అందుకే డబ్బును ప్రజలందరికీ సమంగా పంచాల్సివుంది. అయితే ప్రజలందరి దగ్గర వుండాల్సిన డబ్బు కొందరి దగ్గర చేరిపోవడంతో అది పాపిష్టిదిగా మారిపోయింది. ప్రజలందరి దగ్గర డబ్బు ఉన్నప్పుడే సమాజంపై డబ్బు ఆధిపత్యం చేయలేదు. కాబట్టి ఆర్థికంగా ప్రజలు స్వాతంత్ర్యాన్ని పొందటమే సోషలిస్టు భావజాలం అని చెప్పడమే ఇక్కడ కొ.కు. ఉద్దేశ్యంగా తెలుస్తోంది.

"జ్ఞాని" కథలో - కథకుడు జ్ఞానితో "రష్యా నీకేం ద్రోహం చేసిందనడిగాను. రష్యాలో దారిద్ర్యం లేదు. రష్యాలో మైనారిటీలను దోపిడీ చెయ్యటం లేదు. మెజారిటీని దోపిడీ చెయ్యటం అంతకన్నా లేదు. రష్యన్ ఆర్థిక వ్యవస్థలో సామ్రాజ్యాలు లేనిపోని భారం. ఆవశ్యకతని గుర్తించడం తప్ప మరోమతం లేదు "ఇవన్నీ సమర్థించడానికి బోలెడన్ని ఉదాహణలిచ్చాను"[16] అని అంటాడు.

ఇక్కడ కథకుని మాటల్లో సామ్యవాద భావజాలం కల్గిన ప్రజాసమూహం ఉన్న చోట ఆర్థిక అసమానతలుండవు. అక్కడ ఒక సమూహాన్ని మరొక సమూహం దోపిడీ చేసే అవకాశమే వుండదు. ప్రజలందరూ సమానంగా పనిచేస్తారు. ప్రజల్లో పేద, ధనిక వర్గాలుండవు, కాబట్టి అక్కడ వేగంగా అభివృద్ధి సాధ్యపడుతుంది. రష్యాలోని సామ్యవాద భావజాలం భారతదేశంలో కూడా అమలయితే పేదరికం నశిస్తుందనేది ఇక్కడ రచయిత భావనగా చెప్పవచ్చు.

"హోటల్ పరిచయుడు" కథలో - కథకుడూ, నాదెళ్ళ, మద్దూరి, పంచాంగమూ అనే వారు నల్గురూ మిత్రులు. వీరికి ఒక హోటల్‌లో కొత్త మనిషి ఒకరు పరిచయమవుతాడు. కథకునితో ఆ వ్యక్తి, "భద్రాచలం దగ్గర నూరెకరాల పొలం కొన్నాను. అక్కడి మనుషుల్ని పెట్టి అంతా నేనే చేయించగలను. కాని ఇక్కడ డబ్బు కోసం అగచాట్లుపడే చదువుకున్న వాళ్ళని పట్టుకెళ్ళి వాళ్ళు చెయ్యగలిగినంత భూమి ఇచ్చేసి ఒక కాలనీ ఏర్పాటు చేయాలనుకున్నాను. హాయిగా తిన్నది అరిగేటట్టు పని చేసుకోవచ్చు. కూలీలతో సరి సమానంగా జీవించవచ్చు. వాళ్ళకి సంస్కారం ఇవ్వవచ్చు. వాళ్ళుకూడా మనంతటి వాళ్ళుగా పరిణమిస్తుంటే ఆ పరిణామం చూసి ఆనందించవచ్చు. వాళ్ళని మనం దోచకుండా వుంటే వాళ్ళు మనకన్నా సంపాదనలో ఎంత ముందుకు పోతారో తెలుసుకోవచ్చు. ఇదంతా సంస్కారమూ, అనుభవమూ కాదా!"[17] అని అంటాడు.

ఇక్కడ కథకునితో హోటల్ పరిచయుడు చెప్పిన అంశాల్ని పరిశీలిస్తే చాలామంది చదువుకున్న యువకులు శారీరక శ్రమలేని ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తారు. అది కుదరకపోతే నిరుద్యోగులుగానె మిగిలి పోతారు. ఉద్యోగమే తమ జీవిత లక్ష్యంగా భావించి కాలాన్ని వృథా చేస్తూ జీవిస్తారు. పల్లెల్లో వ్యవసాయం చేయడానికి అంగీకరించరు. తమ చదువు ఉద్యోగం కోసమే అన్నట్లు భావిస్తారు. అయితే ఆ ఆలోచన సరైనదికాదు. తమ చదువునూ, సంస్కారాన్ని, విజ్ఞానాన్ని

వ్యవసాయ రంగంలోని పనుల్లోకి తీసుకురావాలి. విద్యావంతులు పల్లెల్లోకి వెళ్ళాలి. అక్కడ చదువురాని, వెనుక బడిన తరగతుల వారికి తమ విజ్ఞానాన్ని పంచే ప్రయత్నం చేయాలి. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచాలి. దీంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. అంతే కాకుండా సమాజంలో నిరుద్యోగ సమస్య తీరుతుంది. ఈ అంశాన్నే రచయిత ఇక్కడ వెల్లడించాడు.

"నీకేం కావాలి" కథలో – కథకుడు "ఏది జీవితాశయం? ప్రేమా, డబ్బా? – ప్రేమా, డబ్బా! రెండింటినీ తిరస్కరించే వాళ్ళున్నారు. మానవుడి మతమూ, విశ్వాసాలూ, నాగరికతా, సంస్కారమూ – అన్నీ ఆర్థిక పరమైనవేనంటారు సోషలిస్టులు" "జీవితాశయం ఆత్మకు సంబంధించింది. ఆ ఆత్మవికాసం కల్గితే డబ్బూ, తెలివితేటలూ, విజ్ఞానమూ, ఇవ్వలేని అద్వితీయమైన ఆనందమేదో కలుగుతుందంటారు వేదాంతులు. ఇందులో ఏది నిజమో ఆలోచిస్తాను" అని అంటాడు. "ఆర్థిక సమస్య తీరింది కనుక నేను సోషలిస్టులతో ఏకీభవించాను. ఆలోచించిన కొద్దీ అదే సరిగా కనపడ్డది. అసలు ప్రేమలో ఎప్పుడూ స్వార్థం వుంది. ఎవరో కథకుడన్నట్టు ఎంత మన్ను ముట్టిన మహా వృక్షమయినా జన్మించేది మట్టిలోనే అయినట్టు ప్రేమకుకూడా వేళ్ళు స్వార్థంలోనే వుంటై. ప్రేమ కూడా డబ్బుతో మొలకెత్తవలసిందే"[18] అని అనుకుంటాడు.

ఇక్కడ కథకుని ఆలోచనల్ని గమనిస్తే, సమాజంలోని అన్ని రంగాల పునాదులు డబ్బు మీదనే నిర్మించబడ్డాయి. అనేది స్పష్టమవుతోంది. వేదాంతులు ప్రేమ, డబ్బు, సంస్కారం వీటన్నింటికన్నా ప్రధానమైంది ఆత్మవికాసం అని అంటుంటారు. అయితే సమాజాన్ని వాస్తవంగా, లోతుగా పరిశీలిస్తే సామ్యవాద సిద్ధాంతం చెప్పినట్టు సమాజ ఉపరితల నిర్మాణమంతా డబ్బు ద్వారానే నిర్మితమవుతున్నది అని చెప్పడమే పై మాటల్లోని రచయిత ఉద్దేశ్యంగా అవగతమవుతోంది.

"దేవుడిచ్చిన వరం" కథలో - శివయ్య బ్రహ్మదేవుని వరం చేత ధనరాశుల్ని పొందుతాడు. రాజ్యాన్ని ఏర్పాటు చేస్తాడు. ఒకరోజు సభలో నాకు భగవంతుడిచ్చిన దంతా ప్రజలకు పంచేస్తాను అంటాడు. ఇంతలో ఒక గడ్డమాయన లేచినిలబడి "శివయ్య దగ్గర ధన రాసులుండడం కంటె కూడా విలయ హేతువేదన్నావుంటే అది అందరి దారిద్రమూ తీరటమే! ఏమంటారా? వివిధ వృత్తులు చేసుకునేవారు దరిద్రంలో వుంచబట్టే సంఘం నడుస్తోంది. చాకళ్ళూ, మంగళ్ళూ, సాలీలూ, కమ్మరులూ, వడ్రంగులూ మొదలైన వృత్తులవారు బ్రాహ్మణులు మొదలైన వారితో సమానం అయితే సంఘానికి కావలసిన సంపదను ఎవరు సృష్టిస్తారు? సంపదను సృషించేవారి దారిద్ర్యం మీదనే సంఘ జీవితమంతా ఆధారపడి వుండగా ఆ దారిద్ర్యాన్ని తొలగించడంకన్నా సంఘానికి విపత్కరం మరొకటి ఉండదు. యిదే మంత దుర్గ్రాహ్యమైన విషయం కాదు"[19] అని అంటాడు.

ఈ మాటల్ని పరిశీలిస్తే పెట్టుబడి దారి వర్గపు ఆర్థిక వేత్తల్ని పరోక్షంగా ఈ మాటల్లో ఆక్షేపించడమే ఇక్కడ రచయిత ఉద్దేశం. పెట్టుబడి దారులు సమాజంలో దారిద్ర్యం నిత్యం వుండాలనే కోరుకుంటారు. డబ్బు క్రింది తరగతుల్లోకి చేరితే వారు సంపదను సృష్టించరని వీరి విశ్వాసం. సమాజంలో కేవలం ఒక్కశాతం వున్న పెట్టుబడి దారి వర్గానికి అనుకూలమైన ఆర్థిక విధానాలు అమల్లోవున్నాయి. సంపద సృష్టి జరగాలంటే సమాజంలో ఆర్థిక ఇబ్బందులు, దారిద్ర్యం ఉండాల్సిందే అంటున్నటు వంటి ఆర్థిక శాస్త్ర వేత్తల్ని పై మాటల్లో రచయిత ఆక్షేపించాడు.

ఇప్పటి వరకూ పై మూడు అధ్యాయాల్లో కుటుంబరావు కథల్లోని ఆర్థిక జీవనప్రతి ఫలనాన్ని పరిశీలించాం. తరువాత అధ్యాయంలో ఆర్థిక అంశాలతో పాటు సామాజిక అంశాలతో మిళితమైన సామాజిక జీవన ప్రతిఫలనాన్ని విశ్లేషించుకుందాం.

# నాల్గవ అధ్యాయం సూచికలు

1. కొ.కు. రచనా ప్రపంచం, (విరసం ప్రచురణ) - మూడవ సంపుటం, పుట - 117-119
2. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - రెండవ సంపుటం, పుట - 379-383
3. కొ.కు. రచనా ప్రపంచం, (విరసం ప్రచురణ) -రెండవ సంపుటం, పుట - 436-440
4. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - మూడవ సంపుటం, పుట - 106-110
5. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - నాల్గవ సంపుటం, పుట - 31-39
6. కొ.కు. రచనా ప్రపంచం, (విరసం ప్రచురణ) -నాల్గవ సంపుటం, పుట - 103-109
7. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - నాల్గవ సంపుటం, పుట - 392-397
8. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - మొదటి సంపుటం, పుట - 143-147
9. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - రెండవ సంపుటం, పుట - 222-225
10. కొ.కు. రచనా ప్రపంచం, (విరసం ప్రచురణ) -మూడవ సంపుటం, పుట -468-475
11. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - నాల్గవ సంపుటం, పుట - 17-23
12. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - నాల్గవ సంపుటం, పుట - 103-109
13. కొ.కు. రచనా ప్రపంచం, (విరసం ప్రచురణ) -మొదటి సంపుటం, పుట - 233-236
14. కొ.కు. రచనా ప్రపంచం, (విరసం ప్రచురణ) -మొదటి సంపుటం, పుట - 319-328
15. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - రెండవ సంపుటం, పుట - 77-80
16. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - రెండవ సంపుటం, పుట - 282-285
17. కొ.కు. రచనా ప్రపంచం,(విరసం ప్రచురణ) - రెండవ సంపుటం, పుట - 265-269
18. కొ.కు. రచనా ప్రపంచం, (విరసం ప్రచురణ) -రెండవ సంపుటం, పుట - 333-373
19. కొ.కు. రచనా ప్రపంచం, నాల్గవ సంపుటం, పుట - 255-263